అడుగుజాడలు

తాత ముసలి వృద్ధు. శరీరం ముడతలు పడిపోతుంది. అడుగులు తడబడతాయి. అది కీకారణ్యం. నలుదిక్కులా చీకటి. కాని తాతకి భయంలేదు. మనమడితో అంటాడు తాత. 'మా ముత్తాతల కాలంనాడు ఏర్పడింది ఈదారి. అంతకుముందు యీ అడవిచుట్టూ ఆరుమైళ్ళు నడిచి పోయేవారు జనం. మా ముత్తాత సాహసించి యీ అరణ్యానికి అడ్డుపడ్డాడు. మళ్ళీ అతన్ని చూడ మనుకున్నారు మావాళ్ళంతా. కాని అతడు నిశ్చయంగా అరణ్యందాటి ఆ వూరికి చేరుకున్నాడు. క్రూరజంతువులు అతన్నిచూసి భయపడి పారిపోయాయని అనుకునేవారు అందరూ. మహానుభావుడు. అతని అడుగుజాడల్లో తరవాత తరవాత ఎందరో నడిచారు''

మనమడు బలశాలి. యౌవనంతో కలకల్లాడుతూ ఉంటాడు. గట్టి కండలమీద చర్మం బిగించి లాగినట్టు పరుచుకుంటుంది. తాత మాటలకు అతని

కళ్ళు కొంటెగా నవ్వుతాయి. ఈ చిట్టికివిలో అంత భయపడవలసింది ఏముందో అతనికి బోధపడదు. తాతతో అంటాడు. "తాతా నీకో కొత్తదారి చూపిస్తానురా" తాత ముసలి ముఖంమీద ముడతల్లోను అనుమానం భయం తొంగిచూస్తాయి. అందరూ నడిచేదారి ఉండగా.కొత్తదారి ఎందుకురా మనకి.... అంటాడు. మనమడు నవ్వుతూ పెరవారి తొవ్వుతాడు. దారివదలి రావడానికి భయపడతాడు అపక్కయేరుంది. ఆ యేట్లో మొసళ్లుంటాయని అందరూ అనుకుంటారు. కాని మనుమడికి మొసళ్ళంటే భయంలేదు. తాతరానంటాడు మనుమడు....యేరుదాటితే అవతలేపూరు; మైలన్నా ఉండదు అంటాడు. తాతంటాడు. యేరుదాటినా అవతల పెద్దపుట్టలో పాముందంట. ఎందరినో కరచిచంపింది....మనుమడంటాడు. పుట్టదగ్గరగా పోవద్దులే. దూరంగామట్టి పోదాం మొసళ్ళంటే భయంలేని మనుమడికి పామంటేభయం అంచేతతాతచెయ్యిపట్టుకొని మెల్లగాయేరు దాటిస్తాడు. ఒక్క మొసలికనబడదు పాముపుట్టకు మాత్రం దూరంగామట్టి తాతమనుమడు ఊరుచేరుకుంటారు. మనుమడు యేరుదాటిన సంగతి ఊరందరికీతెలుస్తుంది. మొదట్లో కొందరు అనుమానిస్తారు. కొందరు ఈ కొత్తదారి చాలా ప్రమాదమయినదంటారు. కాని కొందరు సాహసించి మనుమడు పోయినదారిని యేరు దాటుతారు. క్రమంగా పాతదారి మాయమయిపోతుంది కొత్తదారి పాతబడుతుంది.

హరిశాస్త్రి పెద్ద విద్వాంసుడు.షట్ఛాస్త్రాలూ ఆయనకి కంఠస్థం. శ్రోత్రీయ కుటుంబంలో పుట్టినవాడు. ఆయన తండ్రి ధర్మశాస్త్రంలో నిష్ణాతుడు. ఏదన్నాధర్మసందేహాలొస్తే ఆయన తీర్చవలసిందే. కొడుకుని తనంతటవాణ్ణిచేశాడు.కాని హరిశాస్త్రి విచిత్రంగా మారిపోయాడు. చివరరోజుల్లో హరిశాస్త్రి పితృగృహంవిడిచి దూరంగా పోవలసివచ్చింది. తండ్రి బెంగతో మంచమెక్కాడు కాని చనిపోయేముందు ఆయన ఆఖరుకోరికఇది. "నా శవాన్ని తాకడానికిగాని అపరకర్మలు చేయడానికిగాని నా కొడుక్కిఅధికారంలేదు. వాడు

కులభ్రష్టుడు. వాడీఇంట్లో అడుగు పెడితే అంతాఅపవిత్ర మయిపోతుంది." తండ్రి కోరికనుమన్నించి హరిశాస్త్రి ఆ యింటికిపోలేదు. తండ్రి శవాన్ని చూడలేదు.

హరిశాస్త్రికి పిత్రార్జితం బాగా ఉండి ఒకప్పుడు. కాని క్రమంగా ఆ ఆస్తంతా సన్నగిల్లిపోయింది అయినా ఆయనంటే అందరికీ అపరిమితమైన గౌరవం. ఎందుకంటే ఆ ఆస్తంతా ఒక ఆదర్శంకోసం వినియోగపడింది. ఆయన ఇప్పుడు పెద్దవాడయిపోయాడు. ఊరిపెద్దలు ఇంటిఅరుగుమీద చేరుతుంటారు ఆయన వారితో ముచ్చటిస్తూ కాలక్షేపం చేస్తుంటాడు.

మా తండ్రిగారికి నాకూ మధ్యవచ్చిన వివాదం ఏమంటే పంచములు అస్పృశ్యులని స్మృతిశాస్త్రాదులు ఘోషిస్తున్నాయంటారాయన. అస్పృశ్యత మానవధర్మం కాదని నా వాదన అయితే నాకుకనువిప్పు కలిగించిన మహానుభావుడు మహాత్మా గాంధీగారు. ఎంత అసహజమయిన సంప్రదాయం వచ్చిపడిందో మాశ్రుతి మనకి నేనుతరువాత వెతికిచూచాను. మూలగ్రంథాలలో ఎక్కడా అస్పృశ్యతా దోషమనేది లేనేలేదు. అవతారపురుషుడాయన. మామూలు మాటల్లో అందరికీ తెలిసేటట్టు. అఖండమయిన జ్ఞానమార్గాన్ని బోధించాడు అస్పృశ్యత హైందవ సంప్రదాయానికి అవమానమన్నాడు. ఆహా! హా! ఎంత విశాలహృదయుడు. ఎంత ప్రగాఢమయిన జ్ఞానసంపత్తి!

ఇలా రోజులు రోజులు ఆయన చెపుతూనే ఉంటాడు. పెద్దలు వింటూ ఉంటారు. బంధువులు, బ్రాహ్మణులు ఆయన్ను మొదట్లో వెలివేశారు. చాకలి మంగళ్లు ఇంటికి రావడం మానేశారు. కొద్దిరోజులు అష్టకష్టాలూ పడ్డారాయన అయినా ఆయన హరిజనవాడలో తన కార్యకలాపాలు విరమించలేదు. అదొక వీరగాథ.

రామమూర్తి ఆయన ఏకైకపుత్రుడు. అతడు ఆంగ్లవిద్య అభ్యసించడానికి హరిశాస్త్రి మొదట్లో ఒప్పుకోలేదు. కాని భార్యబలవంతంవల్ల, కాల

ధర్మాన్నిబట్టి చివరికి ఆయన ఒప్పుకోవలసి వచ్చింది. రామ్మూర్తి బి. ఏ. పాసయాడు.

తండ్రి కొడుకుల మధ్య సంబంధం చిత్రమయినది. రామ్మూర్తి చిన్ననాటినుంచీ తండ్రితోకూడా తిరిగాడు. నిద్రలోలేపి అడిగినాసరే, గాంధీగారు ఎప్పుడెప్పుడు ఏమేమన్నారో చెప్పగలిగేవాడు. హరిశాస్త్రికి కొడుకంటే ఎంతో గారం కాని ఆయన అతన్ని ఎత్తుకుని ఎప్పుడూ ముద్దాడి యెరగడు. ఎవరూ లేనప్పుడు కొడుకు కంటపడితే, ఆయన చూపులో ఎంతో ఆశ, ఆదుర్దా, ఏదో ఎరగరాని ఆవేదన ప్రతిఫలించేవి. అంతకుమించి ఎన్నడూ ఆయన కొడుక్కి చనువిచ్చిఎరగడు.

రామ్మూర్తికి తండ్రిమీద ఉన్నది భయమో భక్తో చెప్పడం కష్టం. అతనెప్పుడూ తండ్రి ముఖంలోనికి తిన్నగా కళ్ళెత్తి చూడలేదు. ఎన్నడూ తండ్రి మాటకు ఎదురుచెప్పి ఎరగడు. అతనికి ఇంగ్లీషు చదువు చదువుకోవాలని ఉన్నా, అతనుమాత్రం తండ్రినెప్పుడూ అడగలేదు. ఆ విషయమయిన తల్లి, తండ్రీ వాదోపవాదాల్లో పడ్డప్పుడు తనకేమి సంబంధం లేనట్టుగానే ఉన్నాడు. అతను పెద్దవాడయి ప్రయోజకుడయాకకూడా తండ్రిచెప్పినట్టు తన సొంతచేత్తో వడికిన ఖద్దరు వస్త్రాలు తప్ప కట్టుకునిఎరగడు

కాని రామ్మూర్తి హృదయం లోతుపాతులు అతనికి తప్ప ఎవరికీ తెలియవు. సలార్‌జంగ్ అతని స్నేహితుడు. సహాధ్యాయి. వాళ్ళఇంటికి అతను తరుచు వస్తూపోతూ ఉండేవాడు. గుమ్మంతెరల వెనుక కనిపించీ కనిపించకుండా ఒకమూర్తి అతనిదృష్టిని ఆకర్షించేది. రెండుకళ్ళేవో తన్నిచూసి నవ్వుతున్నట్టు అతనికి అనిపించేది. ఆ ఇంట్లో అంత ఘోషా లేకపోయినా మొదటిరోజుల్లో ఆ అమ్మాయి ఇవతలికి వచ్చి అతనికంట పడలేదు.

ఒకనాడొక చిత్రమయిన సంఘటన జరిగింది. అతను తన ఊరినించి బయలుదేరి పట్నం పోవడానికి రైలెక్కాడు. బండికిక్కిరిసి ఉంది. ఒకస్టేషనులో ఒక యువతి రైల్లోకి ఎక్కలేక కంగారుపడుతూ ప్లాట్‌ఫారంమీద నిలబడి

పోయింది. రామ్మూర్తి చూసి బండిదిగి ఆమెను జాగ్రత్తగా పెట్టెలోకి ఎక్కించాడు. బెజవాడ జంక్షనులో దిగేవరకు అతను ఆమెకు తనచోటిచ్చి నిలబడ్డాడు. బెజవాడలో అతను తన సామానులు దింపుకుని వెళ్లిపోబోతూ ఆగాడు. ఆయువతి ముఖంలో అసహాయత్వం తనవేపు ఆశగా చూస్తున్నట్టు అనిపించిందతనికి. ఎక్కడికి వెళతారు? అని అడిగాడు. గుంటూరు ఇక్కడ రైలు మారాలి అంది ఆమె. నేనూ గుంటూరే రండి. ఫరవాలేదు అన్నాడు. వహీదా అని తరువాత తెలిసిందతనికి. ఆమె సలార్‌జంగ్ చెల్లెలు. ఆ తరువాత అతను ఆ ఇంటికి వెళ్ళినప్పుడల్లా ఆమె నవ్వుతూ వచ్చి అతనితో కబుర్లు చెప్పేది. క్రమంగా కొత్తపోయి చనువేర్పడింది. మొదట్లో అతను వాళ్ళింట్లో మంచినీళ్లుకూడా ముట్టలేదు. కాని క్రమంగా ఫలహారాలు కూడా సేవించేవాడు. ఆమె చేత్తో ఇచ్చినప్పుడు నిరాకరించడం పెద్ద అపచారమనిపించేదతనికి. అయితే అతనిమార్పుకి వెనక పెద్ద సూత్రాలు సిద్ధాంతాలూ ఏవీ లేవు. అసలు లోలోపల అతనికి సూత్రాలమీదా సిద్ధాంతాలమీద కొంత అసహనంకూడా ఉంది. కాని మనసులో ఉన్నది పైకి చెప్పడం అతనికి ఎన్నడూ అలవాటులేదు. అంచేత చాలా రోజులు అతని మనసులో రహస్యం రహస్యంగానే ఉండిపోయింది.

వహీదా చాలా చలాకీఅయినది. ఆమె ఎప్పుడూ ఏదో అంటూనే ఉంటుంది. ఆ ఛలోక్తులు రామ్మూర్తిని గిలిగింతలుపెట్టినా అతను నవ్వి ఊరుకునేవాడు.

ఈ పరిచయానికి పర్యవసానం రామ్మూర్తి మనస్సులో అస్పష్టంగానే ఉంది. వహీదా మూర్తి అతని నిద్రలో కూడా అతన్ని కలతపెట్టేది. ఒకపక్క ప్యారి. ఒకపక్క తనతండ్రి హరిశాస్త్రి; తన్ని చెరోచెయ్యి పట్టుకొని లాగుతున్నట్టు కలలు వచ్చేవి. ఈ మథనంలో నుంచి అతన్ని చివరికి బయటపడేసింది వహీదాయే. ఒకనాడు ఏకాంతంగా ఉన్నప్పుడు ఒకనాడు

ఏకాంతంగా ఉన్నప్పుడు వహీదా చటుకుని అంది ఎన్నాళ్ళీదాగుడుమూతలు? రామ్మూర్తికి వెంటనే ఏం చెప్పాలో తోచలేదు తనకేమీతెలియనట్టు నటించడం రామ్మూర్తికి చేతకాదు కొంతసేపు మౌనంగా కూర్చుని తరువాత నిట్టూర్చి మెల్లగా అన్నాడు "మా నాన్నని నువ్వెరగవు" వహీదా అంది. "అమాట కొస్తే మావాళ్ళూ ఒప్పుకోరు. వాళ్ళకి భయపడి మనం సుఖాల్ని. ఆశల్ని ఎందుకు వదులుకోవాలి?"

తరువాత ఎన్నోసార్లు అతని మనస్సులో ఈ ప్రశ్న తలెత్తింది. దానికి సమాధానం ప్యారీ ప్రశ్నలోనే ఉంది. అది అతని మనస్సుకి పట్టిన తరవాత ఒక రోజున వహీదాతో అన్నాడు....ఈపేళ మా ఊరు వెడుతు న్నాను నాలుగు రోజుల్లో తిరిగొస్తాను. వచ్చిన తరువాత యిద్దరం పెళ్ళి చేసుకుంటాం.

కాని తన ఇంటికివచ్చిన తరువాత తండ్రితో యీ సంగతి చెప్పడం అనుకున్నంత సులభంగా అతనికి కనిపించలేదు. క్షణంక్షణం వాయిదాలు వేస్తూగడిపాడు. కాని మామూలుగానే అతను ముభావంగా ఉంటాడు. అంచేత అతనిలో యింతమథనం జరుగుతోందని తల్లికీ తండ్రికీ కూడా తెలియలేదు.

చివరికి నాలుగవరోజున అతను తండ్రికి చెప్పడానికి అతను మనస్సు దిట్టపరుచుకున్నాడు. తండ్రీ ఏమంటాడో అన్నభయంకంటే. ఈ వార్త తండ్రికి ఎంత గొడ్డలిపెట్టుగా ఉంటుందోనన్న ఆదుర్దా అతన్ని ఎక్కువ కలతపెట్టింది.

తండ్రి మామూలుగా ఊరిపెద్దలతో కూర్చుని తన చిన్ననాటి హరి జనోద్యమాన్ని గురించి ఉత్సాహంగా చెప్తున్నాడు. రామ్మూర్తి అరుగు మీదికివెళ్ళి. నాన్నా....నీతో కొంచెం మాట్లాడాలి అన్నాడు. ఇంతవరకు యిల్లాంటి మాట కొడుకు నోటివెంట హరిశాస్త్రి ఎప్పుడూ వినలేదు. హరి

శాస్త్రికినొక కొత్తసంగతే. ఏంనాయనా అంటూ లేచివచ్చాడు ఒక క్షణం పాటూ రామ్మూర్తి తన మనస్సులో విషయం ఏమైనాసరే తండ్రికి చెప్పకూడదనుకున్నాడు. కాని మరుక్షణం సర్దుకుని అన్నాడు "నేను పెళ్ళిచేసుకోదలచుకున్నాను" హరిశాస్త్రికి దీని అర్థం ఏమీ అంతుపట్టడంలేదు. అన్నాడు మెల్లగా. "సరే అయితే....ఏదన్నా సంబంధం చూద్దాం" రామ్మూర్తి కొంచెం ఆగి అన్నాడు".... అదికాదు నాన్నా....నేనొక అమ్మాయికి మాటిచ్చాను. హరిశాస్త్రి అన్నాడు. "నాకిదివరకు ఏమీ చెప్పలేదేం" రామ్మూర్తి సాహసించి అనేశాడు "ఆ అమ్మాయి మహమ్మదీయులపిల్ల" హరిశాస్త్రి ఆగి అన్నాడు కొంచెం ఆగి బొంగురుపోయిన గొంతుకతో అన్నాడు. "మతేమన్నా పోయిందా? అందులో కోపం గాని, అసహ్యంగాని లేదు వట్టిబాధ. రామ్మూర్తి గబగబా సంగతంతా చెప్పేశాడు. తన నిశ్చయాన్ని కూడా తెలియపరిచాడు. హరిశాస్త్రి ఏమీ మాట్లాడలేదు. కొడుకు చెప్పినదంతా విన్నాడు చివరికి అన్నాడు నీ మనస్సు మైలపడిపోయింది. అంతకంటే గొప్పతనం యింకొకటి లేదు. రామ్మూర్తి ఆదుర్దాగా అన్నాడు. "మాలవాళ్ళు మనుషులయితే మహమ్మదీయులు మాత్రం కారా? గాంధీగారయితే యిటువంటి వివాహాలకి అభ్యంతరం చెప్పరని నానమ్మకం." కాని ఆవాదంలో రామ్మూర్తికే నమ్మకంలేదు. హరిశాస్త్రి అన్నాడు. "తక్షణం నువ్వీ ఇంట్లోంచి అవతలికిపో నాకు కొడుకే పుట్టలేదనుకుంటాను.

రామ్మూర్తి ఊరువదలి పట్నం వచ్చేశాడు. అతని మనస్సెంతో చాలా తేలికపడింది. ఏదో బరువు చటుక్కున తీసేసినట్టు తిన్నగా వహీదా యింటికి వచ్చాడు. ఎవరో మహమ్మదీయుల్లో పెద్దలు సావడిలో ఉన్నారు. అందరి ముఖాలు తీవ్రంగా ఉన్నాయి. రామ్మూర్తి రావడంతోటే అందరూ వెళ్ళిపోయారు.

సలార్‌జంగ్ రామ్మూర్తితో అన్నాడు. "నువ్వు మా ఇంటికి రావడం మానేస్తే అందరికి మంచిది." రామ్మూర్తి అడిగాడు "వహీదా అభిప్రాయం కూడా అదేనా?" సలార్‌జంగ్ అన్నాడు "వహీదా ఎంత పట్టుదల మనిషో నీకు తెలియదు." రామ్మూర్తి "ఆమెకు నాకు ఇష్టమయితే మా పెళ్ళి ఆపగలిగేవాళ్ళెవరు?" సలార్‌జంగ్ నిట్టూర్చి అన్నాడు. "మా మహమ్మదీయులకి ఉద్రేకాలు చాలా ఎక్కువ. ఏం ప్రమాదం జరుగుతుందో అని నా భయం" రామ్మూర్తి అడిగాడు. "వొచ్చి ఏమన్నా బెదిరించారా?" సలార్‌జంగ్ "మరే."

రామ్మూర్తి మనస్సులో సమస్య స్పష్టంగా విడిపోయింది. అతనికి అనుమానాలు లేవు. బలమయిన ఆవేశం అతన్ని పట్టుకుంది. తనుచేస్తున్న పని చాలా సహజమయినది. అందరూ చేయ్యవలసిందీని ఈ బెదిరింపులు విన్నతరువాత అతనిలో దాగున్న శౌర్యం. సాహసం విజృంభించాయి. ఎందరుఎన్నివిధాల చెప్పనావినక రిజిష్ట్రారు ఆఫీసులో వహీదాను పెళ్ళాడాడు. వహీదా నవ్వుతూ అతనిపక్కన నిలబడింది.

మరునాడుదయం రెండు శవాలను యింట్లోంచి తీశారు. వాళ్ళకోసం కన్నీరు కార్చినవాళ్ళు తక్కువ. ఈ దారుణం ఎందుకు జరిగిందో అందరకీ తెలిసినా. హంతకులెవరో ఎవరికీ తెలియనట్టుగానే అందరూ నటించారు పంచాయితీ అయిన తరువాత కొందరు యువకులు ఆ శవాలకు దహన సంస్కారం చేశారు. రెండు చితులూ మండుతుండగా ఎందరో యువకులు శ్మశానంలో మూగారు. చితులు కాలిపోయిన తరువాత ఎంతోసేపు మౌనంగా అల్లాగే నిలబడ్డారు.

కొడుకు హత్యసంగతి విన్నప్పుడు హరిశాస్త్రి ముఖంలో ఏచలనమూ కనబడలేదు. మామూలుగానే ఆయన హరిజనోద్యమాన్ని గురించి మధ్యాహ్నం నలుగురికీ చెపుతుండేవాడు. కాని ప్రతి రాత్రి యేటిగట్టున ఒంటరిగా

ఎవరో ముసలివాడు గుండెలమీద కుడిచేత్తో రాసుకుంటూ రాముడూ అని అరుస్తూ తిరుగుతుంటాడని. విన్నవాళ్ళు చెప్తుంటారు.

మనుమడు తాతవుతాడు తాతకి మళ్లీ మనుమడు తయారవుతాడు. తాతమనుమడు అరణ్యంలో దారివెంట ఊరికి బయలుదేరుతారు. ఏటిలో నిర్భయంగాదిగి అవతలి ఒడ్డుకి చేరుకుంటారు తాతచెప్తాడు. ఒకప్పుడు యీ యేట్లో మొసళ్లుంటాయని అందరూ భయపడేవారు. ఈ యేరుమట్టి మూడు మైళ్ళునడిచి ఊరుచేరుకునేవారు. మొదట్లో నేనే సాహసించి యేరుదాటాను మొసళ్ళూలేవు. ఏవీలేవు. తరువాత అందరికీ ఈ దారే అలవాటయిపోయింది తాత గొంతులో ధ్వనించిన గర్వానికి మనమడు నవ్వుకున్నాడు. ఈ యేట్లో మొసళ్ళుంటాయని భయపడ్డవాళ్ళు పెర్రి కాని అతనినమ్మకం. తాతనడవ బోతున్నాడు మనవడన్నాడు తాతా ఈ దారినిపోదాం రా వందగజాల్లో ఉంది ఊరు. ఎందుకల్లా చుట్టు తిరిగిపోవడ ? తాత అన్నాడు. అక్కడో పెద్దపుట్టఉంది అందులో బ్రహ్మాండమయిన తాచుపాముంది. మనుమడు నవ్వికొత్తదారి తొక్కాడు తాతనయాన్ని భయాన్నిచెప్పి చూశాడు. చివరికి విసుగెత్తి నీ కర్మం పో. నేనురాను అన్నాడు. మనుమడు కొత్తదారితొక్కాడు పుట్టలో పాముబుస్సమంది. మనమడు ఒడుపుగా కాసుకు లబడ్డాడు. పాము అతని మీదకురికింది. మనమడు పాము తల చేత్తోపట్టాడు. పాము చేతికి చుట్టుకుంది. చేతినరాలు పట్టుతప్పాయి. పాముకాటు వేసింది అతను ఉన్నబలమంతా తెచ్చుకుని పాముతల పిడికిలితో నొక్కాడు. మనమడు బతకలేదు కాని పాముకూడా చచ్చిపోయింది.

తరువాత ఆ దారిని ఎంతోమంది నిర్భయంగావెళ్ళారు. దారిపాత బడింది. కాని అడుగున మరుగుపడిపోయిన ఆ దారిలో ఎక్కడో ఉన్నాయి అతని అడుగుజాడలు.

యువ:- 1971